క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


అలంకరణలో ముసలమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన చెరువు కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ తల్లి ఆలయంలో మంగళవారం నాలుగో వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం 6 గంటలకు అమ్మవారికి ఫల పంచామృతాభిషేకం, కలశ స్థాపన, గణపతి హోమం, ఆదిత్యాధి నవగ్రహ హోమం, 10 గంటలకు మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, 12 గంటలకు అమ్మవారికి హారతులు, మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మ వారిని మండల కేంద్రంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుశీలమ్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

హెచ్‌సీఎల్ బీటెక్ స్కాలర్‌షిప్, జాబ్‌కు ఎంపిక


విద్యార్థిని లిఖిత

పామిడి: మండలంలోని మోడల్‌స్కూల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని లిఖిత హెచ్‌సీఎల్ బీటెక్ స్కాలర్‌షిప్ కమ్ జాబ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అరుణ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ, మోడల్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు హెచ్‌సీఎల్ కంపెనీ స్కాలర్‌షిప్‌తో పాటు ఉపాధి కల్పిస్తోంది. అందులో భాగంగా నిర్వహించిన పోటీల్లో లిఖిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఇందుకు హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతి నెలా రూ.10 వేల స్టైఫండ్‌తో పాటు ఆమెకు నచ్చిన కళాశాలలో బీటెక్ చదవే అవకాశం కల్పించి, కోర్సు అనంతరం కంపెనీలో ఉద్యోగ అవకాశం ఇస్తుందన్నారు. జిల్లా నుంచి ఈ ఘనత సాధించిన ఏకైక విద్యార్థిని లిఖితను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా ఫాదర్ ఫెర్రర్ జయంతి


ఆర్డీటీ పాఠశాలలో ఫెర్రర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఫాదర్ ఫెర్రర్ చిత్రపటం,విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గార్లదిన్నె ఆర్డీటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఫాదర్ ఫెర్రర్ ఎంత గానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీఓ వరలక్ష్మి, కదిరెప్ప, ఆర్డీటీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఫెర్రర్ సేవలు మరువలేం


యాడికిలో ఫాదర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దివ్యాంగులు

యాడికి: ఫాదర్ ఫెర్రర్ సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న ఫాదర్ విగ్రహానికి మండలంలోని దివ్యాంగులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అలాగే విజన్ స్కూల్ విద్యార్థులు ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు కదిరప్ప నాయుడునరసింహ, గోపాల్ రెడ్డి, ప్రమీల, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ


మహిళలకు సరుకులను అందజేస్తున్న ఐఎఫ్‌సీఓ సంస్థ సభ్యులు

తాడిపత్రి అర్బన్: ఐఎఫ్‌సీఓ ఆధ్వర్యంలో పట్టణంలో టైలర్స్‌కాలనీ, కృష్ణాపురం, గాంధీనగర్, శ్రీనివాసపురం, శివాలయం వీధి, సీపీఐ కాలనీల్లోని పేద కుటుంబాలకు మంగళవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సంస్థ జిల్లా అడ్మిన్ మహ్మద్ రఫీ మాట్లాడుతూ ఐఎఫ్‌సీఓ సంస్థ మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాల్లో రైతులు, మహిళల ఆర్థికాభివృద్ధికి ఎన్నో సహాయక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు, డీఎం గోపి, జిల్లా మేనేజర్ గోపి, డీలర్ చంద్రశేఖర్, మండల ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబరం.. ఉగాది సంబరం

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు మంగళవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు విశిష్టత, సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా గ్రామాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. క్రోధి నామ సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలుకుతున్న వేళ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్త ఏడాదిని పురస్కరించుకుని ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆయా గ్రామాల్లో మహిళలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉగాది పచ్చడిని ఇంటిల్లిపాదీ సేవించారు. పలు ఆలయాల్లో వేద పండితులు పంచాంగ పఠనం, వ్యవసాయ పంచాంగ ఆవిష్కరణ చేశారు. యువత గ్రామీణ క్రీడలైన టెంకాయ విసురు పందెం, రాతి గుండు ఎత్తడం, కబడ్డీ పోటీల్లో పాల్గొని సరదాగా గడిపారు. అలాగే రైతులు పొలాల్లో గొర్రు, నాగలికి పసుపు కుంకుమ పూసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వృషభాలను ప్రత్యేకంగా అలంకరించి చిన్నారుల చేతుల మీదుగా సేద్యం పనులను ప్రారంభించారు. అనంతరం పొలాల్లో రైతులు గుంటక సాగు తోలారు. చిన్నారులతో సేద్యం పనులను ప్రారంభిస్తే పంటలు బాగా పండుతాయని నమ్మకం.


పామిడిలోని మహాయోగ దత్తపీఠంలో పంచాగ పఠనం చేస్తున్న దత్త పీఠాధిపతి సురేంద్ర మహారాజ్

● ఘనంగా కోటకొండ ఆంజనేయస్వామి తిరునాల


అలంకరణలో కోటకొండ ఆంజనేయస్వామి

పెద్దవడుగూరు: ఉగాది పండుగ రోజు మండలంలోని కోటకొండ ఆంజనేయస్వామి తిరునాల మంగళవారం ఘనంగా ప్రారంభమైంది.. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మొళకతాళ్ల గ్రామంలో అనంతగిరి నాథ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి చిత్రచేడు గ్రామం వరకూ పల్లకీలో ఊరేగించారు. ఏటా ఉగాది రోజు తిరునాల జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

● హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు


రాతి దూలం పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని సర్పంచ్ యు.రామలింగమయ్య ఆధ్వర్యంలో మంగళవారం రాతి దూలం లాగుడు పోటీలను నిర్వహించారు. గ్రామ శివారులో జరిగిన దూలం పోటీలో మొత్తం ఏడు జతల వృషభాలు పాల్గొన్నాయి. పోటీలో గ్రామానికి చెందిన ఎడవలి ఈశ్వరయ్య వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. వెంకటస్వామి వృషభాలు రెండవ స్థానం, గోవిందు వృషభాలు మూడో స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.5,016, రెండో బహుమతి రూ.2,016, మూడో బహుమతి రూ.1,016 రూపాయల నగదు బహుమతులను దాత సర్పంచ్ అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శివ, ఈశ్వరయ్య, బొజ్జన్న, రాముడు పాల్గొన్నారు.

● ముంగారు సేద్యం ప్రారంభం


గొందిపల్లి సమీపంలోని పొలంలో గుంటక తోలుతున్న రైతు

గుత్తి రూరల్: మండలంలోని గొందిపల్లి, తురకపల్లి, కరిడికొండ, తొండపాడు, అబ్బేదొడ్డి, బేతాపల్లి, కొత్తపేట, అనగానదొడ్డి, వన్నేదొడ్డి, మాముడూరు, బసినేపల్లి, లచ్చానపల్లితో పాటు ఇతర గ్రామాల్లో బుధవారం రైతులు ముంగారు సేద్యం చేశారు. మంగళవారం వేకువజామున రైతులు తమ పిల్లలకు నూతన వస్త్రాలను ధరింపజేసి పొలాలకు తీసుకెళ్లారు. పొలాల్లో గొర్రు, నాగలికి పసుపు కుంకుమ పూసి పూజలు నిర్వహించారు. వృషభాలకు అలంకరించి చిన్నారుల చేతుల మీదుగా సేద్యం పనులను ప్రారంభించారు ఎడ్లకు ప్రత్యేక పూజలు చేసి ఈ ఏడాది పంటలు సుభిక్షంగా పండాలని గుంటక పాశారు. అలాగే ఉగాదిని పురస్కరించుకుని గ్రామాల్లోని ఆలయాల చుట్టూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను తిప్పారు.

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం, చింతల వెంకరటమణస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అలాగే పొలిమేర పెద్దమ్మతల్లి ఆలయం, సుంకులమ్మ పాలెంలోని సుంకులమ్మ ఆలయం, మెయిన్‌బజారులోని పెద్దమ్మతల్లి ఆలయాలను ఉగాది పర్వదినం సందర్భంగా విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుండే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మధ్యాహ్నం స్థానిక పెన్నానదిలో జలధి కార్యక్రమం నిర్వహించారు. గంగపూజ చేసిన జలాన్ని పూర్ణకుంభంతో తీసుకుని ఊరేగింపుగా సుంకులమ్మ ఆలయానికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు.

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరుకోన రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే మండలంలోని గంగాదేవిపల్లిలో వెలసిన గంగాభవానీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగం పఠించారు. కనంపల్లిలోని నల్లలమ్మ అమ్మవారికి అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

యల్లనూరు: మండలవ్యాప్తంగా మంగళవారం ఉగాది పండుగను వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి, శివాలయాలు, సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం అంకాలమ్మ, పెద్దమ్మ, యల్లమ్మ తదితర ఆలయాల వద్ద గ్రామీణులు పూజలు నిర్వహించనున్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో కాశీ విశ్వేశ్వర దేవాలయం, కొండ మీదరాయుని ఆలయం, ఆంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్ పట్టణాల్లో మంగళవారం ఉగాది పర్వదినం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుత్తిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, షిరిడీసాయి బాబా దేవాలయం, రేణుకా ఎల్లమ్మ దేవాలయం, నగరేశ్వరాలయం, కాశీ విశ్వేశ్వరాలయం, ఆర్ఎస్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయం, గౌతమేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రధాన అర్చకుడు వాసుదేవశర్మ పంచాగ శ్రవణం చేశారు.

పెద్దపప్పూరు: చీమలవాగుపల్లి జాతీయ రహదారి సమీపంలో వెలసిన పెద్ద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.అన్నదాతలు భూమాతకు పూజలు నిర్వహించి అనంతరం సేద్యాన్ని ప్రారంభించారు.

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయం. వడ్డేవీధిలోని మహాయోగ దత్తపీఠంతో పాటు పలు ఆలయాల్లో మంగళవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహాయోగ దత్తపీఠంలో సురేంద్రమహారాజ్ పంచాగ శ్రవణం గావించారు.

పెద్దవడుగూరు: మండలంలోని కోటకొండ ఆంజనేయస్వామి దేవాలయం, పెద్దవడుగూరులోని పేట ఉమామహేశ్వరస్వామి దేవాలయం, చెన్నకేశవస్వామి ఆలయం, క్రిష్టిపాడు, మేడిమాకులపల్లి, లక్ష్ముంపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే ఉగాది సందర్భంగా మండల కేంద్రంలో చెన్నకేశవస్వామి ప్రతిమలను రథం ఊరేగించారు.

శింగనమల: మండలంలోని శింగనమల, సోదనపల్లి, మట్లగొంది, సలకంచెరువు, నాయనవారిపల్లి, రాచేపల్లి, నిదనవాడ, తరిమెల, కల్లుమడి, గుమ్మేపల్లి, ఆకులేడు, లోలూరు, వెస్ట్ నరసాపురం, చక్రాయిపేట, పెరవలి, జూలకాల్వ, కొరివిపల్లి, ఉల్లికల్లు గ్రామాల్లో మంగళవారం ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శింగనమలలోని రామాలయంలో ఆత్మాసీతారాములుకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


తాడిపత్రిటౌన్: ఆలూరుకోన రంగనాథస్వామి


శింగనమల: ఆత్మాసీతారాములు


తాడిపత్రి అర్బన్: పుష్పాలంకరణలో సుంకులమ్మ


గార్లదిన్నె: కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి


యల్లనూరు: కోటవీధి ఆంజనేయస్వామి


బుక్కరాయసముద్రం: కొండమీద రాయిడు


పెద్దవడుగూరు : కుంటిమ్మతల్లిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం


గుత్తి: వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి


పెద్దవడుగూరు: పెద్ద ఈరన్నస్వామి


పెద్దపప్పూరు: చెన్నకేశవ స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించండి


గుంతకల్లులో పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే వైవీఆర్


గుత్తిలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. మంగళవారం కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబూ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ దేవేంద్రప్ప ఆధ్వర్యంలో స్థానిక గంగానగర్‌లో ఆ వార్డు పెద్దలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నతోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా శాశ్వతంగా నిలిచేపోయేలా అభివృద్ధి పనులు చేశానన్నారు. జగనన్న చేసిన మంచిని, నియోజకవర్గంలో తన హయాంలో జరిగిన అభివృద్ధిని గమనించాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చెప్పే మాయమాటలను నమ్మవద్దని ఆయన హితవు పలికారు. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన గుంతకల్లులో అరాచక శక్తులకు చోటు లేదన్నారు. తనను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నూర్‌నిజామి, ప్రసాద్, ధనుంజయ, వార్డు, ఇరానీ పెద్దలు పాల్గొన్నారు.

150 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 1, 13వ వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు విష్ణువర్ధన్, కె.రంగారెడ్డి ఆధ్వర్యంలో వివిధ వార్డులకు చెందిన 150 మంది యువకులు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. మంగళవారం సాయంత్రం టీటీడీ కల్యాణ మండపం నుంచి పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించిన యువకులు పార్టీ కార్యాలయంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. కె.కార్తీక్, గణేష్, వాసు, ఆసీఫ్, దేవా, రామాంజి తదితరులకు ఎమ్మెల్యే వైవీఆర్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్లు రామలింగప్ప, రామాంజినేయులు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్, కౌన్సిలర్ లింగన్న, మాజీ కౌన్సిలర్ రంగన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని దోనిముక్కల రోడ్ ఏరియాకు చెందిన ఎంబీసీ జిల్లా కార్యదర్శి మేరీ ఆధ్వర్యంలో సంచార కులాలకు చెందిన 25 మంది ఎమ్మెల్యే వైవీఆర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. రంగన్న, గంగమ్మ, ధీరజాన్, ముంతాజ్, వెంకటమ్మ, శ్రీనివాసులు, కొండమ్మ, కుమారి, సువర్ణ, ఎర్రిస్వామి, సుంకర కొండమ్మ, సువర్ణ, ఓబుళమ్మ, రెహానా, లక్ష్మి, సుబ్బరాయుడు, వెంకటేశులు, నరసమ్మ, లింగమ్మ తదితరులకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన 10 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు శివరాజు, అనిల్, లాల్‌రాజు, వెంకటేష్, భీమిలింగ, కుమార్, రామాంజనేయులు, మహేంద్ర, అజయ్, సురేష్ వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే వైవీఆర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పాలన, ఎమ్మెల్యే సేవలకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని గెలిపించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వివాదాస్పద వ్యక్తులపై నిఘా

పుట్లూరు: వివాదాస్పద వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచామని డీఎస్పీ వెంకటశివారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని చింతకుంట, ఎల్లుట్ల గ్రామాల్లో పర్యటించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ప్రజలు రాజకీయ కక్షలకు దూరంగా ఉండాలని, స్నేహభావంతో మెలిగి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వివాదాస్పద వ్యక్తులను ముందస్తుగా బైండోవర్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ హేమాద్రి పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు

యల్లనూరు: గొడవలకు పాల్పడితే ఎంతటివారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ గిరిబాబు హెచ్చరించారు. మంగళవారం ఎస్‌ఐ మాట్లాడుతూ ఉగాది మరుసటి రోజు కొడవండ్లపల్లి పెద్దమ్మ, చిలమకూరు యల్లయమ్మ, యల్లనూరు పెద్దమ్మ, చింతకాయమంద అంకాలమ్మ, పెద్దమ్మ ఆలయాల వద్ద నిర్వహించే పూజలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారన్నారు. ఆలయాల వద్ద గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. గ్రామాల్లో ఐకమత్యంగా పండుగ చేసుకోవాలని ఎస్‌ఐ సూచించారు.

రైతు ఆత్మహత్య

పెద్దవడుగూరు: మండలంలోని చిత్రచేడు గ్రామంలో రైతు చిన్నపుల్లన్న(48) సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. అతడికి ఒకటిన్నర ఎకరా పొలం ఉంది. పంటలు సక్రమంగా పండక పోవడంతో సుమారుగా 8 లక్షల దాకా అప్పులు చేశాడు. అప్పులు తీరే మార్గం కానరాక జీవితం పై విరక్తి చెంది సోమవారం రాత్రి 8: 30 గంటల ప్రాంతంలో మద్యంలోకి పురుగుల మందు కలిపి తాగాడు. కుటుంబీకులు గమనించి అతడిని పెద్దవడుగూరు ఆస్పత్రికి తీసుకువచ్చారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించగా అక్కడ మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చురుగ్గా ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం

కూడేరు: మండలంలోని ముద్దలాపురంలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఉన్న ఆలయం పాతబడి శిథిలావస్థకు చేరడంతో నూతనంగా ఆలయం నిర్మించేందుకు గ్రామస్తులు సంకల్పించారు. సుమారు రూ. 80 లక్షలతో ఆలయాన్ని నిర్మించనున్నారు. ఇందుకు దాతలు సహకరించాలని గ్రామస్తులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆర్.నాగయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గుంతకల్లు పట్టణంలోని సత్యనారాయణ పేటకు చెందిన నాగయ్య పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో యాడికిలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి గుంతకల్లుకు వస్తుండగా జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై తాడిపత్రి వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగయ్య అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహన సిబ్బంది గాయపడిన వ్యక్తిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాహనం ఢీకొట్టి ఎడమ కాలిపై ఎక్కి వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జయింది. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తీవ్రంగా గాయపడిన నాగయ్య

వాహనాల తనిఖీ

గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లి క్రాస్ 44వ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో వాహనాల్లో మద్యం, పరిమితికి మించిన నగదు రవాణా జరగకుండా వాహనాలు తనిఖీ చేస్తున్నామన్నారు. వాహనాలు , వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.